క్లుప్తంగా

పరిశుభ్రతతో ఆరోగ్యం



మురుగు కాల్వల్లో మందు పిచికారీ చేస్తున్న మలేరియా సిబ్బంది

కర్నూలు (టౌన్): పరిసరాల పరిశుభ్రత పాటిస్తే సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ అన్నారు. శుక్రవారం డ్రైడే కార్యక్రమంలో భాగంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. 5 ,7, 8 డివిజన్లలోని మురుగు కాల్వల్లో సోడియం హైపోక్లోరేట్ పిచికారీ చేశారు. 4 వ డివిజన్‌లో పూడికతీత పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయాల కార్యదర్శులు ప్రతి ఇంటికి వెళ్లి వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. జనవాసాల్లో దోమల నివారణకు నీటి నిల్వలు ఉండకుండా చూడాలన్నారు. లేకపోతే ప్రజలు మలేరియా, అతిసార వంటి జబ్బుల బారిన పడే అవకాశం ఉందన్నారు.

బకాయిలు చెల్లించని మున్సిపల్ షాపుల సీజ్



షాపును సీజ్ చేస్తున్న మున్సిపల్ రెవెన్యూ సిబ్బంది

కర్నూలు (టౌన్): బకాయిలు చెల్లించని నగరపాలక సంస్థ మున్సిపల్ షాపులను శుక్రవారం రెవెన్యూ విభాగం అధికారులు, సిబ్బంది సీజ్ చేశారు. బకాయిల వసూళ్లలో భాగంగా మునిసిపల్ దుకాణాలను అధికారులు తనిఖీలు చేశారు. రూ.1.26 కోట్లు వసూలు కావాల్సి ఉందని, ఇందులో ఇప్పటి వరకు రూ. 12,26,261 వసూలైనట్లు నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ వెల్లడించారు. షాపుల యజమానులు జాప్యం చేయకుండా బకాయిలు వెంటనే చెల్లించి నగరాభివృద్ధికి సహకరించాలని పేర్కొన్నారు. స్పెషల్ డ్రైవ్‌లో నగరపాలక రెవెన్యూ అధికారి జునీద్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు వాజిద్, మన్సూర్, సాధిక్ హుస్సేన్, సిబ్బంది పాల్గొన్నారు.

స్టార్‌కేర్ ఆసుపత్రి వద్ద ఆందోళన



ఆసుపత్రి వద్ద ఆందోళన చేస్తున్న మృతుడి కుటుంబ సభ్యులు

కర్నూలు(హాస్పిటల్): రోగి మృతి చెందడానికి వైద్యుల నిర్లక్ష్యమే కారణమని ఆరోపిస్తూ శుక్రవారం ఉదయం నగరంలోని గాయత్రి ఎస్టేట్‌లో ఉన్న స్టార్ కేర్ ప్రైవేటు ఆసుపత్రి వద్ద రోగి కుటుంబీకులు ఆందోళన చేశారు. తెలంగాణ రాష్ట్రం ఐజకు చెందిన ఖాజామొద్దీన్ (60) ఈనెల 2న బీపీ, షుగర్ అధికం కావడంతో అస్వస్థతకు గురై సదరు హాస్పిటల్‌లో చేరాడు. గురువారం రాత్రి ఆయన పరిస్థితి విషమం కావడంతో విషయాన్ని కుటుంబ సభ్యులు వైద్యులకు చెప్పారు. ఎంత సేపటికీ వైద్యులు వచ్చి చికిత్స చేయకపోవడంతో రాత్రి ఆయన మరణించాడని ఆవేదన వ్యక్తం చేస్తూ వారు శుక్రవారం ఉదయం కొద్దిసేపు ఆసుపత్రి వద్ద ఆందోళన నిర్వహించారు. వైద్యుల నిర్లక్ష్యం వల్లే రోగి మృతిచెందాడని, ఆసుపత్రి యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

విద్యార్థి సంఘాల నాయకులు ఆందోళన



నిరసన తెలుపుతున్న ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ విద్యార్థి, యువజన నాయకులు

కర్నూలు(సెంట్రల్): గత సంవత్సరం క్లస్టర్ యూనివర్సిటీ కళాశాలలో చేరిన విద్యార్థులు ఫీజులు కట్టిన నేపథ్యంలో వారి జగనన్న విద్యా దీవెన(జేవీడీ) రుసుంను వెనక్కి ఇవ్వాలని ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ నాయకులు నిరసనకు దిగారు. క్లస్టర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌గా పనిచేసిన పి.శ్రీనివాసులు రిజిస్ట్రార్ పదవికి రాజీనామా చేసి తన సొంత యూనివర్సిటీ అయినా ఎస్వీయూకు వెళ్తున్నారు. ఈ నేపథ్యంలో ఆయనను సిల్వర్ జూబ్లీ డిగ్రీ కళాశాలలో సన్మానిస్తుండగా విద్యార్థి, యువజన సంఘాలు నిరసనకు దిగాయి. ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు, సోమన్న, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ..గత సంవత్సరం అడ్మిషన్ల సమయంలో రిజిస్ట్రార్‌గా ఉన్న పి.శ్రీనివాసులు ఫీజులు చెల్లించిన వారికే అడ్మిషన్ ఇచ్చారన్నారు. జగనన్న విద్యా దీవెన వస్తుందని చెప్పినా వినకుండా ఫీజులు కట్టించుకున్నారన్నారు. ఫీజులు కట్టిన చాలా మంది విద్యార్థులు జగనన్న విద్యా దీవెనకు అర్హత సాధించారన్నారు. ఈ క్రమంలో విద్యార్థులు కట్టిన ఫీజులను వెనక్కి ఇచ్చిన తరువాతే రిజిస్ట్రార్ వెళ్లాలన్నారు. కార్యక్రమంలో నాయకులు బీసన్న, అశోక్, అభి, మెహబూబ్‌బాషా, శీను, సంతోష్, ఏఐవైఎఫ్ నాయకులు చంటి, కాశీం, శివ, జిక్కీ పాల్గొన్నారు.

దొంగ దొరికాడు..సొత్తు లేదు!

- పోలీసుల అదుపులో అంతర్ జిల్లా దొంగ
- వారం రోజుల వ్యవధిలో వరుసగా మూడు ఇళ్లల్లో చోరీ
- ఆభరణాలు స్వర్ణకార కాంప్లెక్స్‌లో విక్రయించినట్లు అంగీకారం
- ఆందోళనలో నగల తయారీదారులు



కర్నూలు: నగరంలో వరుస చోరీలతో భయాందోళన పరిస్థితులు కల్పించిన దొంగల ముఠాలోని ఒకరు పోలీసుల వలకు చిక్కాడు. అతడిని నగర శివారులోని ఓ రహస్య ప్రాంతంలో ఉంచి విచారించగా కర్నూలు స్వర్ణకార కాంప్లెక్స్‌లోని రెండు దుకాణాల్లో చోరీ చేసినట్లు అంగీకరించాడు. అయితే, దొంగ వద్ద చోరీ సొత్తు లేకపోవడంతో రికవరీ కోసం పోలీసులు వివిధ కోణాల్లో ప్రయత్నాలు ముమ్మరం చేశారు. నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో వారం రోజుల వ్యవధిలో వరుసగా మూడు ఇళ్లల్లో కేటుగాడు చేతివాటం ప్రదర్శించాడు. తాళం వేసిన ఇళ్లను ఎంపిక చేసుకుని రెక్కీ నిర్వహించి మరీ చోరీలకు పాల్పడటంతో నాలుగో పట్టణ పోలీసులతో పాటు సీసీఎస్ పోలీసులు రంగంలోకి దిగి దర్యాప్తు చేపట్టారు. చోరీలు జరిగిన ఇంటి పరిసరాల్లో సీసీ పుటేజీని పరిశీలించారు. బాబా బృందావన్ కాలనీలో నివాసముంటున్న శ్రీనివాసరావు ఇంట్లో ఈనెల 20వ తేదీ గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. వ్యవసాయ సీజన్ కావడంతో ఇంటికి తాళం వేసి శ్రీనివాసరావు, శ్రీదేవి దంపతులు స్వగ్రామానికి వెళ్లి తిరిగి వచ్చేసరికి ఇంట్లోని 45 తులాల బంగారం, కిలో వెండితో పాటు ఖరీదైన టీవీని తస్కరించి పరారయ్యాడు. అలాగే వాసవీ నగర్‌లో నివాసముంటున్న అనంతకృష్ణ శర్మ ఇంట్లో కూడా 12 తులాల బంగారు నగలను దొంగలు ఎత్తుకెళ్లారు. అదే స్టేషన్ పరిధిలోని ఆదిత్య నగర్‌లో కూడా చోరీ జరగడంతో పోలీసులు అప్రమత్తమై సీసీ పుటేజీ ఆధారంగా గాలింపు చర్యలు చేపట్టారు. దొంగ పల్సర్ బైక్‌పై హైదరాబాద్ వైపు వెళ్తుండగా జడ్చర్ల దగ్గర సీసీ కెమెరా పుటేజీలో గుర్తించారు. వెంటనే హైదరాబాద్‌కు వెళ్లి పక్కా ఆధారాలతో దొంగను అదుపులోకి తీసుకుని కర్నూలుకు తీసుకొచ్చి విచారించగా మూడు ఇళ్లల్లో చోరీలు చేసినట్లు అంగీకరించాడు.

రికవరీ ఎలా?

చోరీ చేసిన సొత్తును దొంగ కొండారెడ్డిబురుజు సమీపంలో ఉన్న స్వర్ణకార కాంప్లెక్స్‌లోని చాంద్‌బాషా, వసీంలకు చెందిన దుకాణాల్లో విక్రయించినట్లు సమాచారం ఇచ్చాడు. ఈ మేరకు ఎస్ఐ పవన్ కిషోర్ రెడ్డి, క్రైం పార్టీ సిబ్బందితో కలసి మంగళవారం మధ్యాహ్నం ఆ దుకాణాల వద్దకు వెళ్లి వివరాలను సేకరించారు. దొంగ బంగారాన్ని ఎలా కొంటారని పోలీసులు స్వర్ణకారులను ప్రశ్నించగా తాము దొంగ బంగారం కొనలేదని చెప్పడంతో పోలీసులకు రికవరీ చేయడం తలకు మించిన భారంగా మారింది. స్టోన్ వర్కర్ మన్సూర్‌తో పాటు చాంద్ బాషా, వసీం దుకాణాల్లో పనిచేసే వర్కర్లను కూడా స్టేషన్‌కు రమ్మని ఆదేశించడంతో గురువారం సాయంత్రం ఓ మహిళా కార్పొరేటర్ న్యాయవాదితో కలసి బంగారు నగల తయారీదారులు పెద్ద ఎత్తున పోలీస్‌స్టేషన్ చేరుకుని తమ నిరసన వ్యక్తం చేశారు. అయితే దొంగ గుంటూరు జిల్లాకు చెందినవాడు కావడంతో అక్కడ ఏమైనా చోరీ సొమ్ములు విక్రయించాడా అనే కోణంలో పోలీసులు విచారిస్తున్నారు. దొంగను తీసుకుని గుంటూరుకు వెళ్లి దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం.

అజాగ్రత్తగా డ్రైవింగ్ చేయొద్దు

- ట్రాఫిక్ రూల్స్ పక్కాగా పాటించాలి
- విద్యాసంస్థల బస్సు డ్రైవర్లతో కర్నూలు డీఎస్పీ విజయశేఖర్



పాఠశాలల బస్సు డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న కర్నూలు డీఎస్పీ విజయశేఖర్

కర్నూలు: బడి బస్సులు ట్రాఫిక్ భద్రతా నియమాలు తూచా తప్పక పాటించాలని, ఎవరైనా ఉల్లంఘనకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని కర్నూలు డీఎస్పీ విజయశేఖర్ హెచ్చరించారు. పాఠశాలల బస్సుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. నగరంలోని 35 పాఠశాలలు, కళాశాలల బస్సులను శుక్రవారం స్థానిక ఎస్టీబీసీ కళాశాల గ్రౌండ్‌కు రప్పించి డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బడి బస్సుల భద్రతపై తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి డ్రైవర్లకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ స్కూల్ బస్సులకు సంబంధించి ఇన్సూరెన్స్, పొల్యూషన్ సర్టిఫికెట్, వాహన రికార్డులు, డ్రైవర్లకు సంబంధించి లైసెన్స్ అందుబాటులో ఉంచుకోవాలన్నారు. బస్సును వేగంగా నడిపినా, అజాగ్రత్తగా సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడిపినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బస్సులకు సంబంధించిన పత్రాలు లేకుండా రోడ్లపైకి తీసుకురాకూడదని, అలా ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే మోటర్ వాహనాల చట్టం కింద కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. అవగాహన కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ గౌతమి, రెండో పట్టణ సీఐ ఇంతియాజ్ బాషా పాల్గొన్నారు.

రోడ్డు సైడు వ్యాపారులకు కౌన్సెలింగ్...

కర్నూలు బళ్లారి చౌరస్తా నుంచి ఉల్చాల జంక్షన్ వరకు రోడ్డుకు ఇరువైపులా తోపుడు బండ్లు ఏర్పాటు చేసుకుని వ్యాపారాలు సాగిస్తుండటం వల్ల రద్దీ పెరిగి రాకపోకలకు ఇబ్బంది ఏర్పడుతోంది. దీనిపై వాహనదారుల నుంచి వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో ట్రాఫిక్ సీఐ గౌతమి ఆధ్వర్యంలో శుక్రవారం పోలీసులు ఆ ప్రాంతంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. మొబైల్ క్యాంటీన్లు, పండ్లు, బజ్జీలు, టిఫిన్ల బండ్లను రికవరీ వ్యాన్‌లో కొత్తపేటలోని ట్రాఫిక్ స్టేషన్‌కు తరలించారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది కలగకుండా రోడ్డుకు దూరంగా వ్యాపారాలు సాగించుకోవాలని, లేదంటే కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపరుస్తామని వ్యాపారులకు సీఐ హెచ్చరించారు.

దోమల పెరుగుదలను అరికట్టాలి



ఫ్రైడే డ్రైడే గురించి అవగాహన కల్పిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): సీజనల్ వ్యాధులు రాకుండా దోమల పెరుగుదలను అరికట్టాలని డీఎంహెచ్ఓ డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక జొహరాపురం పరిధిలోని నేతాజీనగర్, ఎన్టీఆర్ కాలనీలో జులై ఒకటి నుంచి ఆగస్టు 31వ తేదీ వరకు డెంగీ వ్యతిరేక మాసోత్సవంలో భాగంగా జరుగుతున్న ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా ఆరోగ్య సిబ్బంది వారి పరిధిలోని వార్డులను సందర్శించి ప్రజలు వారానికి ఒకసారి నీటి నిల్వలు లేకుండా పూర్తిగా తొలగించి దోమల పెరుగుదలను అరికట్టే విధంగా అవగాహన కల్పించాలని ఆదేశించారు. తద్వారా దోమల వల్ల వ్యాప్తి చెందే వ్యాధులను అరికట్టవచ్చన్నారు. ఈ వివరాలను ఫ్రైడే డ్రైడే యాప్‌లో క్రమం తప్పక అప్‌లోడ్ చేయాలని, ఒకవేళ నీటి నిల్వలు గల ప్రాంతాలను గుర్తించినట్లయితే ఆ వివరాలను వెక్టార్ కంట్రోల్ హైజిన్ యాప్‌లో అప్‌లోడ్ చేసి, సంబంధించి సచివాలయ సెక్రటరీ ద్వారా సమస్య పరిష్కారం అయ్యేటట్లు చూడాలన్నారు. ఆయన వెంట వైద్యాధికారులు డాక్టర్ మౌనిక, డాక్టర్ శ్రీరాములు, డీసీఎం ప్రసాద్, వైద్య సిబ్బంది ఉన్నారు.

తెలుగు సాహిత్యానికి రావూరి భరద్వాజ కృషి ఎనలేనిది



రావూరి భరద్వాజ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నేతలు

కర్నూలు(అర్బన్): జ్ఞానపీఠం అవార్డు గ్రహీత బ్రహ్మశ్రీ రావూరి భరద్వాజ తెలుగు సాహిత్యానికి చేసిన కృషి ఎనలేనిదని అఖిల భారతీయ విశ్వకర్మ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు దేవపూజ ధనుంజయ ఆచారి అన్నారు. శనివారం రావూరి భరద్వాజ జయంతి సందర్భంగా స్థానిక ఉద్యోగనగర్‌లోని శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయంలో కమిటీ సభ్యులు వెంకటరమణాచారి, శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దేవపూజ ధనుంజయ ఆచారి మాట్లాడుతూ రావూరి భరద్వాజ తెలుగు కథా, నవలా రచయితగా, రేడియో రచయితగా పేరు తెచ్చుకున్నారన్నారు. 37 కథా సంపుటాలు, 17 నవలలు, 6 మినీ బాల నవలలు, 5 బాల కథా సంపుటాలు, 3 వ్యాస, ఆత్మకాథ సంపుటాలు, 8 నాటికలు, ఐదు రేడియో కథానికలు రచించారన్నారు. బాల సాహిత్యంలో కూడా ఈయన విశేష కృషి చేశారన్నారు. మూడు సంవత్సరాలు కృష్ణాపత్రికలో మూడు సంవత్సరాల పాటు ధారావాహికంగా వెలువడిన పాకుడురాళ్లు నవలపై శ్రీకృష్ణ దేవరాయ, శ్రీ వెంకటేశ్వర విశ్వ విద్యాలయాల్లో పరిశోధనలు జరగడం విశేషమన్నారు. తెలుగు సాహిత్యానికి ఆయన చేసిన కృషికి జ్ఞానపీఠం అవార్డు దక్కిందన్నారు. రావూరి భరద్వాజ విశ్వకర్మల ముద్దుబిడ్డగా నిలిచారని పలువురు నేతలు ఈసందర్భంగా కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మణాచారి, వెంకటస్వామి, బ్రహ్మయ్య ఆచారి తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ



దుకాణంలో రికార్డులు తనిఖీ చేస్తున్న అధికారులు


ఆదోని రూరల్: ఆదోని మండలంలోని విత్తన, ఎరువుల దుకాణాల్లో శుక్రవారం వ్యవసాయ, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఏడీఏ వి.హనుమంతరావు, విజిలెన్స్ అధికారి చంద్రశేఖర్‌రెడ్డి తనిఖీలు చేపట్టారు. శ్రీ భీమేశ్వర ఫర్టిలైజర్స్ షాపులో స్టాక్ బుక్‌లోని వివరాలకు ఈ పాస్ మిషన్‌లో పొందుపరిచిన నిల్వల్లో తేడాలు ఉండడంతో రూ.5,88,520 విలువల గల రసాయన ఎరువుల అమ్మకాలను తాత్కాలికంగా నిలిపివేశారు. భువనేశ్వరి సీడ్స్ దుకాణంలో రూ.22,61,941 విలువల గల రసాయన ఎరువుల అమ్మకాలను తాత్కాలికంగా నిలిపివేసినట్లు వారు చెప్పారు. అలాగే భువనేశ్వరి సీడ్స్ సెంటర్‌లో రూ.2,46,240 విలువగల బీటీ పత్తి విత్తనాలను, గీత హైబ్రిడ్ సీడ్స్‌లో రూ.1,07,700 విలువైన కూరగాయల విత్తనాల అమ్మకాలను తాత్కాలికంగా నిలిపివేసినట్లు తెలిపారు. అలాగే నవత ట్రాన్స్‌పోర్టు, ఎస్ఆర్ఎంటీ ట్రాన్స్‌పోర్టుల్లో తనిఖీలు నిర్వహించారు. ఏఓ అశోక్‌కుమార్ రెడ్డి, ఏడీఏ అరుణకుమారి పాల్గొన్నారు.

కోసిగి: మండల కేంద్రంలోని లక్ష్మీనరసింహ ఏజెన్సీస్, మంజునాథ ట్రేడర్స్, వాసవీ ఫర్టిలైజర్స్ దుకాణాలను ఆదోని ఏడీఏ అరుణకుమారి, విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ పల్నాడు ఏడీఏ వి.హనుమంతరావు తనిఖీ చేశారు. మంజునాథ దుకాణంలో మిరప విత్తనాలకు సంబంధించిన స్టోర్స్ సర్టిఫికెట్ లేకపోవడంతో రూ.6,81,120 విలువ చేసే విత్తనాల విక్రయాలను నిలుపుదల చేశారు. ఏఓ రాజు వెంట ఉన్నారు.

ఉరుకుందకు పోటెత్తిన భక్తజనం

కౌతాళం: ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయంలో వేలాది మంది భక్తులతో సందడి నెలకొంది. శుక్రవారం అమావాస్య కావడంతో భక్తులు తమ ఇలవేల్పును దర్శించుకునేందుకు వేలాదిగా తరలివచ్చారు. స్వామివారి దర్శనం కోసం గంటకు పైగా సమయం పట్టింది. తెల్లవారుజామున 4 గంటలకు అర్చకులు స్వామివారి మూలవిరాట్‌కు సుప్రభాతసేవ, మహామంగళహారతి, ఆకు పూజ, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పరిసరాలు ఎటు చూసినా భక్త జనసంద్రంగా కనిపించాయి. ఆలయ డిప్యూటీ కమిషనర్ హెచ్.వెంకటేశ్, సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు. భక్తుల సౌకర్యార్థం ఆదోని, ఎమ్మిగనూరు, కర్ణాటకలోని రాయచూరు, శిరుగుప్ప, డిపోల వారు ప్రత్యేక బస్సులను నడిపారు.

వేలం పాటలు వాయిదా



వేలం నిర్వహించేందుకు సమావేశమైన అధికారులు

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద ఈరన్నస్వామి ఆలయంలో ఒక సంవత్సరం పాటు టెంకాయలను సరఫరా చేసేందుకు, కొబ్బరి చిప్పలను పోగు చేసుకొనే హక్కుల కోసం శుక్రవారం నిర్వహించ తలపెట్టిన వేలం పాటలు వాయిదా పడ్డాయి. ఈ వేలం పాటను ఈ నెల 20వ తేదీన నిర్వహించనున్నట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ హెచ్.వెంకటేశ్ తెలిపారు. దీంతో పాటు నిత్యాన్నదాన కార్యక్రమానికి కూరగాయల సరఫరా, సులభ్ కాంప్లెక్స్ నిర్వహణ, పారిశుద్ధ్య నిర్వహణ, పాదరక్షల స్టాండ్ నిర్వహణ కోసం టెండర్లు, స్వామి వారికి నిత్య పూజల కోసం పూలు, అగర్‌బత్తిలు సరఫరా చేసేందుకు నిర్వహించిన వేలాలకు కూడా పాటదారులు ముందుకు రాకపోవడంతో వీటిని కూడా వాయిదా వేసినట్లు ఆయన తెలిపారు. టెంకాయల వేలం పాటకు రామన్నగౌడ్ రూ.75 లక్షలకు సీల్డ్ టెండరు వేసినప్పటికీ నిబంధనల ప్రకారం డబ్బు చెల్లించేందుకు ముందుకు రాకపోవడంతో వాయిదా వేశారు. తిరిగి ఈ నెల 20న అన్ని వ్యాపారాలకు సంబధించి వేలం పాట నిర్వహించనున్నట్లు ఆయన వివరించారు. వేలం సందర్భంగా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మంత్రాలయం సీఐ, ఆదోని ట్రాఫిక్ సీఐలు ఏరిషావలి, మంజునాథ్, కౌతాళం ఎస్ఐ నరేంద్రకుమార్‌రెడ్డి గట్టి పోలీసు బందబస్తు ఏర్పాటు చేశారు.

సంక్షిప్తం

నేడు కరెంట్ కట్

కర్నూలు(అగ్రికల్చర్): నగరంలో ఇటీవల నెలకొల్పిన విద్యుత్ శాఖ టవర్లపై 33కేవీ లైన్ లాగే పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. శనివారం నాలుగైదు టవర్లపై లైన్ లాగుతున్నందున వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ డీఈ నాగ ప్రసాద్ తెలిపారు. వెంకటరమణ కాలనీ, రామలింగేశ్వర నగర్, మాచాని సోమప్ప కాలనీ, అశోక్ నగర్ పరిసర ప్రాంతాలకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

8న బీజేపీ విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశం

కర్నూలు కల్చరల్: భారతీయ జనతా పార్టీవిస్తృత స్థాయి కార్యవర్గ సమావేశం ఈనెల 8వ తేదీన రాజమండ్రిలో జరుగుతుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నగరూరు రాఘవేంద్ర పేర్కొన్నారు. శుక్రవారం నరసింహారెడ్డి నగర్‌లోని పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజమండ్రిలో జరిగే సమావేశంలో భవిష్యత్తు ప్రణాళికలు, పార్టీ బలోపేతం, సభ్యత్వ నమోదు కార్యక్రమం లాంటివాటిపై చర్చిస్తారన్నారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మురళి నాయుడు, బీజేపీ కోడుమూరు కో- కన్వీనర్ గోపాల్ పాల్గొన్నారు.

రేపు శ్రీజగన్నాథ రథయాత్ర మహోత్సవం

కర్నూలు కల్చరల్: అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం (ఇస్కాన్) ఆధ్వర్యంలో ఈనెల 7వ తేదీ శ్రీ జగన్నాథ రథయాత్ర మహోత్సవం నిర్వహిస్తున్నట్లు కర్నూలు ఇస్కాన్ బాధ్యులు రఘునందన సేవక్ ప్రభు తెలిపారు. భగీరథ కాంప్లెక్స్‌లోని శ్రీ పూరీ జగన్నాథ మందిరం ప్రాంగణంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 10 గంటలకు హరినామ సంకీర్తనే, 11.30 గంటలకు రథయాత్ర ఉత్సవం, ప్రత్యేక ప్రవచనం, మహారాజభోగ హారతి, ఆశీర్వాదం, మహా ప్రసాద వితరణ జరుగుతాయని పేర్కొన్నారు. ఇస్కాన్ సభ్యులు, భక్తులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

ధోబీ, గార్డెనర్ పోస్టులు భర్తీ చేయడం లేదు

కర్నూలు(హాస్పిటల్): డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ ఆదేశాల మేరకు దోబీ, గార్డెనర్ పోస్టులు భర్తీ చేయడం లేదని కర్నూలు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టినరసమ్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నోటిఫికేషన్ నెం.02/2023లోని ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

7న డయాబెటీస్‌పై అవగాహన సదస్సు

కర్నూలు(హాస్పిటల్): డయాబెటీస్(షుగర్) వ్యాధిపై ఈ నెల 7వ తేదీన అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు కర్నూలు హార్ట్ ఫౌండేషన్ కార్యదర్శి డాక్టర్ పి. చంద్రశేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎ.క్యాంపులోని కర్నూలు హెల్త్‌క్లబ్‌లో సాయంత్రం 6 గంటలకు సదస్సు ప్రారంభమవుతుందని, సదస్సులో షుగర్ జబ్బు గురించి ఎండోక్రైనాలజిస్టు డాక్టర్ బి. భరత్ వివరిస్తారన్నారు.

భక్తి శ్రద్ధలతో చండీ హోమం



ప్రత్యేక అలంకారంలో మహా శివుడు

కర్నూలు కల్చరల్: నగర శివారులోని శ్రీ సూర్యనారాయణ స్వామి ఆలయంలో శుక్రవారం అమావాస్యను పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నవగ్రహ, లక్ష్మీ గణపతి, మూల మంత్ర సహిత చండీ హోమం విశేషంగా జరిగింది. యాగశాలలో రాహుకాల దుర్గా పూజ, లలితా సహస్రనామ పారాయణం నిర్వహించారు. ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని శివుడికి అన్నాభిషేకం నిర్వహించారు. స్వామిని, అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



హోమంలో పాల్గొన్న భక్తులు

టీడీపీ నేతను అరెస్టు చేయకపోతే ఊరుకోం

- టీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ చంద్రప్ప



సమావేశంలో మాట్లాడుతున్న చంద్రప్ప

కర్నూలు(అర్బన్): నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలం కోర్నపల్లి గ్రామంలో విధులు నిర్వహిస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు వెంకటప్పపై బూతులు తిట్టిన టీడీపీ నేత విజయభాస్కర్‌రెడ్డిని వెంటనే అరెస్ట్ చేయాలని, లేకపోతే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉద్యమం చేపడతామని ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ చంద్రప్ప హెచ్చరించారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికార పార్టీ దర్పంతో గిరిజన వర్గానికి చెందిన ఉపాధ్యాయుడిపై బెదిరింపులకు పాల్పడిన తెలుగుదేశం నాయకుడిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలన్నారు. రేషన్ బియ్యాన్ని పాఠశాలలో ఉంచడమే కాక ఉపాధ్యాయుడిని బెదిరించడం దారుణమన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చి నెల రోజులు గడవక ముందే గ్రామీణ ప్రాంతాల్లో ఆ పార్టీ అధికారాన్ని అడ్డుపెట్టుకొని దౌర్జన్యాలకు పాల్పడుతున్నారన్నారు. ఇలాంటి వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకొని ఉపాధ్యాయుడు వెంకటప్పకు రక్షణ కల్పించాలన్నారు. సమావేశంలో అంబేడ్కర్ విద్యార్థి సంఘం కన్వీనర్ కాకాని మధుక్రిష్ణ, టీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రామరాజు, వెంకటేష్, నాయకులు వినయ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

అవీ-ఇవీ

4,589 కుల ధ్రువీకరణ దరఖాస్తుల పరిశీలన

కర్నూలు (టౌన్) : రెండు రోజుల్లో 4,589 పెండింగ్ కుల ధ్రువీకరణ పత్రాల దరఖాస్తులను పరిశీలించినట్లు నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రకియను మరింత వేగవంతం చేయాలని నగరపాలకలోని సచివాలయాల వీఆర్ఓలకు ఆదేశాలు సైతం జారీ చేసినట్లు తెలిపారు. త్వరలోనే పెండింగ్‌లో ఉన్న 19,704 ధ్రువపత్రాల పరిశీలన పూర్తి చేస్తామని తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

మంత్రాలయం: మండల కేంద్రంలోని రాఘవేంద్ర పురానికి చెందిన ఓ వివాహిత రైలు కింద పడి ఆత్మహత్య చేసుకుంది. వివరాలు.. మంత్రాలయానికి చెందిన రాము, నాగమ్మ దంపతుల కుమార్తె పద్మావతి (22)ను అదే గ్రామానికి చెందిన మేనమామ సెంట్రింగ్ పనిచేసుకునే వీరేష్‌కు ఇచ్చి రెండేళ్ల కిందట వివాహం చేశారు. వీరికి ఒక కుమారుడు ఉన్నాడు. ఈ క్రమంలో గురువారం రాత్రి దంపతుల మధ్య చిన్న గొడవ చోటు చేసుకుంది. దీంతో మనస్తాపం చెందిన పద్మావతి ఉదయం తుంగభద్ర నదిపై ఉన్న బ్రిడ్జిపైకి చేరుకొని రైలు కింద పడి బలవన్మరణానికి పాల్పడింది. కర్ణాటకలోని రాయచూరు రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు రాబట్టారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రాయచూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

నాలుగు ఇసుక ట్రాక్టర్లు సీజ్

కోడుమూరు రూరల్: గోరంట్ల హంద్రీనది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లు, ఒక జేసీబీని సీజ్ చేసినట్లు ఎస్ఐ బాలనరసింహులు తెలిపారు. గురువారం రాత్రి గోరంట్ల నుంచి ఎలాంటి అనుమతి లేకుండా అదే గ్రామానికి చెందిన కొందరు ఇసుక తరలిస్తుండగా దాడి చేసి పట్టుకున్నామని చెప్పారు. జేసీబీతో పాటు నాలుగు ట్రాక్టర్లను సీజ్ చేశామన్నారు.

తైక్వాండో క్రీడాకారుడికి అభినందన

కర్నూలు (టౌన్): గత నెల 20 వ తేదీన స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి తైక్వాండో పోటీల్లో బాష్యం స్కూల్‌లో 8 వ తరగతి చదివే బి.క్రిష్ణవంశీ బంగారు పతకం సాధించాడు. బంగారు పతకం సాధించిన ఈ క్రీడాకారుడిని శుక్రవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో వీఆర్ హాస్పిటల్ అధినేత డాక్టర్ సి.వాసు రెడ్డి అభినందించారు. రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో సైతం రాణించాలని ఆకాంక్షించారు.

మహారాజశ్రీ కర్నూలు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో
I.P. No. 8/2024

షేకున్‌కాతు ..అర్జీదారు/Debtor
-Vs-
తహెరాన్ వగైరా ..రెస్పాండెంట్లు/Creditors

జనరల్ నోటీసు

కర్నూలు జిల్లా, కర్నూలు గ్రామము వద్దెగేరి ప్రజలకు తెలియజేయడం ఏమనగా పై నంబరు I.P.లో అర్జీదారు /డెబిటార్ తనను దివాలా దారుగా తీర్మానించమని కోరుతూ సెక్షన్ 6,7,10 మరియు 13 ఇన్‌సాల్‌వెన్సీ యాక్టు ప్రకారం అర్జీదారు అయిన షేకున్‌కాతు భర్త ఉశేన్ ఖాన్ ఇం.నెం. 32-282బి, గద్దా వీధి అను ఆమె పై కోర్టులో IP దాఖలు చేసినది. ఇందులో ఎవరికైనా ఆక్షేపణ ఉన్న 18-07-2024వ తేది పగలు 10.30 గంటలకు పై కోర్టులో హాజరై తెలుపు కొనవలెను. లేని యెడల పరోక్షమున విచారించి తీర్మానింపబడును.

కోర్టు వారి ఉత్తర్వు మేరకు

ఎన్.ధనుంజయుడు

అర్జీదారుపరం అడ్వకేటు, కర్నూలు. సెల్: 9704246279

విద్యార్థులకు మెరుగైన విద్య, వసతి కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న లాజరస్

కర్నూలు(సెంట్రల్): ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మెరుగైన విద్య, వసతి కల్పించాలని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్ ఈ.లాజరస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ..కస్తూరిబా పాఠశాలలో ఒక్కో తరగతికి 40సీట్లు మాత్రమే ఉన్నాయని, వాటి సంఖ్యను పెంచాలని డిమాండ్ చేశారు. ఇప్పుడిప్పుడు చాలా మంది తల్లిదండ్రులు తమ ఆడ పిల్లలను చదివించేందుకు ముందుకు వస్తుండడంతో ప్రతి మండల కేంద్రంలో అదనంగా మరో కేజీబీవీ పాఠశాలను ఏర్పాటు చేయాలని లేని పక్షంలో ఉన్న పాఠశాలల్లోనే సీట్లు, ఉపాధ్యాయుల సంఖ్యను పెంచాలన్నారు. అలాగే ప్రతి మండలం కేంద్రంలోనూ గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేయాలన్నారు. ఆరు నుంచి 12వ తరగతి వరకు విద్యను అందించే మోడల్ స్కూళ్లలో బాలురుకు హాస్టల్ వసతి కల్పించాలన్నారు. కార్యక్రమంలో డీసీసీ కోర్డినేషన్ కమిటీ చైర్మన్ అనంతరత్నం మాదిగ, నాయకులు బజారన్న, సయ్యద్ నవీద్, షేక్‌ఖాజా హుస్సేన్, రేపల్లె ప్రతాప్ పాల్గొన్నారు.